క్లుప్తంగా

మెరిసిన బొద్దికూరపాడు విద్యార్థిని



అవార్డు అందుకుంటున్న హేమశ్రీ

తాళ్లూరు: ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సీవీ రామన్ టాలెంట్ టెస్టులో మండలంలోని బొద్దికూరపాడు గ్రామానికి చెందిన పుట్లూరి వెంకటరెడ్డి కుమార్తె హేమశ్రీ ప్రతిభ కనబరిచింది. స్థానిక అమెరికన్ పబ్లిక్ స్కూల్లో 4వ తరగతి చదువుతూ సీవీ రామన్ టాలెంట్ టెస్టులో ప్రకాశం జిల్లా నుంచి ద్వితీయ స్థానంలో నిలిచింది. ప్రతిభ కనపరిచిన హేమశ్రీని కళాశాల చైర్మన్ పులి వెంకటేశ్వర్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

బత్తాయి తోటల పరిశీలన



మాట్లాడుతున్న ఉద్యాన శాఖాధికారి గోపీచంద్

కురిచేడు: మండలంలోని దేకనకొండలో సాగు చేసిన బత్తాయి తోటలను జిల్లా ఉద్యానవన శాఖాధికారి వై.గోపీచంద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బత్తాయి తోటల ఆకులు సూక్ష్మ పోషక లోపాలతో పసుపు రంగులోకి మారడం గమనించినట్లు పేర్కొన్నారు. దీని నివారణకు ఫార్ములా-4 లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున పిచికారీ చేసుకోవాలని తెలిపారు. రైతులు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీరు అందించాలని, ఎరువులు పెట్టి తద్వారా తక్కువ నీటితో తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని పొందొచ్చన్నారు. రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ 11 అంకెల నంబర్‌ను కలిగి ఉండాలని తెలిపారు. రబీ కాలంలో పంట నమోదు చేసుకున్న రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఉద్యానవన శాఖ అధికారి డి.సంధ్య, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పంచాయతీలపై పచ్చ నేతల పడగ

- ఉత్సవ విగ్రహాలుగా సర్పంచ్‌లు
- కూటమి నేతల కబంధ హస్తాల్లో గ్రామ స్వరాజ్యం



పెద్దారవీడు సచివాలయం

పెద్దారవీడు: పంచాయతీలకు ప్రథమ పౌరులుగా భావించే సర్పంచ్‌లకు కూటమి ప్రభుత్వంలో విలువ లేకుండా పోతోంది. గ్రామ ప్రథమ పౌరులుగా బాధ్యతలు నిర్వర్తించే సర్పచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లె పండగ పేరుతో ఒక్కరోజు గ్రామసభ నిర్వహించి గ్రామాల అభివృద్ధి పేరుతో సర్పంచ్‌లను బెదిరించి సంతకాలు పెట్టించుకున్నారు. కొన్ని పంచాయతీల్లో కనీసం సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యంగా పనులు చేపట్టారు. కొన్ని పంచాయతీల్లో అభివృద్ధిని అడ్డుకోలేక సంతకాలు చెయాల్సి వచ్చిందని పలువురు సర్పంచ్‌లు విచారం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల్లో పట్టు సాధించేందుకు ముందస్తు వ్యూహంతో తమ మార్పును చూపించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. పల్లె పండగ పేరుతో గ్రామాల్లో సిమెంటు రోడ్లు నిర్మిస్తున్నామని ప్రచారం ప్రారంభించారు. గ్రామ పథమ పౌరుల అధికారాలను హరించేందుకు రాత్రికి రాత్రే నూతన జీఓలను ప్రవేశ పెట్టి కార్యదర్శులను అడ్డం పెట్టుకుని సర్పంచ్‌ల అధికారానికి కోతలు పెట్టారు. మండలంలో 19 పంచాయతీలు ఉండగా వైఎస్సార్ సీపీ మద్దతుదారులు 16 పంచాయతీలు, టీడీపీ మద్దతుదారులు 3 పంచాయతీలు కై వసం చేసుకున్నారు. నేడు కూటమి ప్రభుత్వం పంచాయతీ సర్పంచ్‌లపై కక్ష పూరితంగా వ్యవహరించడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. గతేడాది ఆగష్టు 23న రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఆ సభల్లో సిమెంటు రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకునేందుకు పంచాయతీల పాలక వర్గాలు, స్థానిక ప్రజల ఆమోదం కోసం చర్చించారు. అయితే సందట్లో సడేమియా..అని ఖాళీ పేపర్లలో తీర్మాన పత్రాలపై సంతకాలు చేసుకుని కూటమి నేతలకు పల్లె పండగ పందేరం చేసేందుకు కార్యచరణ సిద్ధం చేసుకున్నారు. పల్లె పండగ పేరుతో చేపడుతున్న ఉపాధి హామీ పథకం నిధులు కూటమి నేతల దోపిడీకి వరంగా మారాయి. మండలంలో 16 పంచాయతీల్లో సీసీ రోడ్లు 33 పనులకు రూ.5 కోట్లతో పనులు చేపట్టారు. అధికారంలోకి వచ్చిన 6 నెలలకే బంపర్ ఆఫర్ ప్రకటిస్తూ సర్పంచ్‌ల అధికారాలను సైతం విస్మరించి కూటమి నేతలకు పనులు ముట్టజెప్పారు. దీంతో నామ మాత్రపు అధికారుల పర్యవేక్షణతో నాసిరకంగా పనులు పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో సర్పంచ్‌ల బాధ్యతలను పక్కన పెట్టి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెత్తనం చెలాయిస్తున్నారు. పంచాయతీల్లో చిన్న చిన్న మరమ్మతుల నుంచి పెద్ద పెద్ద పనుల వరకు టీడీపీ నాయకులు నడిపిస్తున్నారు. సర్పంచ్‌లకు కనీస సమాచారం లేకుండా రోడ్ల నిర్మాణం, గోకుల షెడ్లు, ఇతరత్రా పనులు చేసుకుంటున్నారు. ప్రతి పనికి కచ్చితంగా సర్పంచ్ అమోదం ఉండాలి. అయితే సర్పంచ్ అమోదం లేకుండానే దర్జాగా పనులు జరిపిస్తున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులు సైతం సర్పంచ్ తీర్మానం లేకుండానే చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే సర్పంచ్‌ల సంతకాలతో పని లేకుండా పనులు చేసుకునేలా ప్రభుత్వం జీఓ ఇచ్చిందని టీడీపీ నాయకులు చెబుతున్నారు. స్థానిక సంస్థల్లో పట్టు సాధించేందుకు ముందస్తు వ్యూహంతో తమ మార్పు చూపించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. పంచాయతీ పాలన మొత్తం సర్పంచ్‌ల చేతుల మీదుగా జరగాలనే నిబంధన ఉంది. పూర్తైన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ప్రారంభించాలంటే శిలాఫలకాలపై సర్పంచ్‌లు, ఎంపీటీసీల పేర్లు నమోదు చేయాల్సి ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. ఇదేం న్యాయమని మండల అధికారులు, పంచాయతీ అధికారులను ప్రశ్నిస్తే అటు నుంచి సమాధానం రావడం లేదు.

> **రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది**
>
> 
>
> భారత రాజ్యాంగాన్ని అమలు చేయకుండా గ్రామాల్లో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని కూటమి నేతలు అమలు పరుస్తున్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంలో కూటమి నేతలు రచయితలుగా చేరి భారతదేశ రాజ్యాంగ వ్యవస్థనే తమ చేతుల్లోకి తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సర్పంచ్‌లకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వడం లేదు. ప్రజాస్వామ్యంగా జరగాల్సిన పనులు టీడీపీ నేతలు ఇష్టమొచ్చినట్లు చేపట్టడం సరైన పద్ధతి కాదు.
>
> – **ఆదినారాయణ యాదవ్**, సర్పంచ్, వైఎస్సార్ సీపీ ఇంటలెక్చువల్ వింగ్ జిల్లా అధ్యక్షుడు, గొబ్బూరు

> **సర్పంచ్‌లకు విలువ లేదు**
>
> 
>
> ప్రత్యక్ష ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్‌లకు కూటమి ప్రభుత్వంలో విలువ లేకుండా పోయింది. అందుకు నిదర్శనం పల్లె పండగ రోడ్లను ఏకపక్షంగా కూటమి నేతలకు అప్పగించడమే. మా పంచాయతీలో మంజూరైన పల్లె పండగ రోడ్లను స్థానిక టీడీపీ నేతలు నిర్మించారు. మా అధికారాలను టీడీపీ నాయకులు తమ చేతల్లోకి తీసుకున్నారు. కేంద్రం ప్రభుత్వం విడుదల చేస్తున్న ఉపాధి హామీ పథకం నిధులు సైతం కూటమి వర్గీయులకే కేటాయిస్తూ ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. అధికారులను ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా టీడీపీ నేతలకు వంత పాడుతున్నారు.
>
> – **వెన్నా సంజీవరాణి**, సర్పంచ్, ఎస్.కొత్తపల్లి

బూచేపల్లిని కలిసిన మారం



ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లిని సన్మానిస్తున్న మారం ఇంద్రసేనారెడ్డి

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీగా నియమితులైన జిల్లా సర్పంచ్‌ల సంఘ ఉపాధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డితో భేటీ అయ్యారు. మంగళవారం చీమకుర్తిలోని ఆయన నివాసంలో బూచేపల్లిని కలిసి పార్టీలో తన సేవలు గుర్తించి జిల్లా జనరల్ సెక్రటరీగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బూచేపల్లిని శాలువాతో ఘనంగా సత్కరించారు. సర్పంచ్ చిమట సుబ్బారావు, ఉప సర్పంచ్ పులి ప్రసాద్ రెడ్డి, నాయకులు కైపు అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈఓ-1 సుబ్బయ్య

తాళ్లూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని క్షేత్రస్థాయిలో అమలు చేసి పిల్లల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ-1 సుబ్బయ్య సూచించారు. స్థానిక వీకేజీహెచ్‌ఎస్‌లో మంగళవారం ప్రారంభించిన జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులకు 51 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరయ్యారు. ఈ ఆరు రోజులు సమన్వయం పాటించి శిక్షణ తరగతులకు క్రమం తప్పకుండా హాజరవ్వాలని ఎంఈఓ-2 సుధాకర్‌రావు కోరారు. హెచ్‌ఎం శేషగిరిరావు, సూపర్‌వైజర్ జ్యోతి, ఆర్పీలు, శ్రీమన్నారాయణ, చంద్రిక, శివరాంరెడ్డి పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతులకు ఎంఈఓలు మస్తాన్‌నాయక్, కొండలరావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలని కోరారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. కోర్సు డైరెక్టర్‌లుగా మహంతనాయక్, ఎస్‌వీ నారాయణరెడ్డి వ్యవహరించారు. డీఆర్పీలుగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అంజమ్మ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కోటపాటి శ్రీనివాసులు, ఇమ్మడి శ్రీనివాసులు, ఏడుకొండలు పాల్గొన్నారు.



పెద్దారవీడులో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

చిన్నారులకు అర్థమయ్యేలా బోధించాలి

పెద్దారవీడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు అర్థమయ్యే విధంగా బోధించాలని కార్యకర్తలకు ఎంఈఓ పి.శ్రీనివాసులు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఎంఈఓ మాట్లాడుతూ చిన్నారుల అభ్యాసన సామర్థ్యాలను గమనించి మెరుగుపరిచేలా ఉండాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ జిల్లా కో ఆర్డినేటర్ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రాజెక్టు, 120 రోజుల సర్టిఫికెట్ కోర్సు, పునాది అక్షరాస్యత, గణితం అవశ్యకత, 3 నుంచి 8 సంవత్సరాల పిల్లల మెదడు అభివృద్ధి గురించి వివరించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, ఆర్పీలు మహేష్, టీవీ సుబ్బారావు, సీఆర్పీలు మస్తాన్, వీరాంజనేయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు సమస్యలు వివరిస్తున్న అంగన్‌వాడీలు

కురిచేడు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూనియన్ నాయకులు షేక్ ఫాతిమా డిమాండ్ చేశారు. మండలంలోని అంగన్‌వాడీలు మంగళవారం సాయంత్రం వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్‌లను మెయిన్ సెంటర్లుగా పెంచుతూ జీవో ఇవ్వాలని, హెల్పర్లకు ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ రూపొందించాలని, సంక్షేమ పథకాలు అంగన్‌వాడీలకు అమలు చేయాలని, సర్వీసులో చనిపోయిన వారికి దహన సంస్కార ఖర్చులు రూ.20 వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సమ్మె కాలంలో చనిపోయిన వారికి కూడా అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సెంటర్ల అద్దెలు, టీఏ బిల్లులు వెంటనే ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజరు పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, మెనూ చార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ కనీసం 3 నెలలు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం తహసీల్దార్ రజనీ కుమారికి అందజేశారు. ఎన్.విజయరాణి, ఎం.రాజ్యలక్ష్మి, పార్వతి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందడం అదృష్టం



కన్యాకుమారిని సన్మానిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ముండ్లమూరు (కురిచేడు): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య పర్యవేక్షకురాలిగా పని చేస్తున్న కన్యాకుమారి ఉద్యోగోన్నతిపై వెళ్తుండటంతో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఆమెకు మంగళవారం ఘన వీడ్కోలు పలికారు. కన్యాకుమారి పబ్లిక్ హెల్త్ నర్స్‌గా ఉద్యోగోన్నతి పొంది బాపట్ల జిల్లా అద్దంకి మండలం మోదేపల్లి ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. ఆమెను వైద్యాధికారులు ఎం.జాస్మిన్, వెంకటేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు జాస్మిన్, వెంకటేశ్వరరెడ్డిలు మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలు అంకిత భావంతో నిర్వహించి ప్రజల మన్ననలు పొందటంకన్నా గొప్ప అదృష్టం మరొకటి ఉండదన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నారాయణరావు, డీపీఎంఓ ఎన్వీ సుబ్బారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ శారద, సీనియర్ అసిస్టెంట్ ప్రభుదాసు, ఫార్మసీ అధికారి యుగంధర్, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ అధికారులు, సూపర్‌వైజర్ సుబ్బారావు పాల్గొన్నారు.

రైతులకు యూనిక్ ఐడీ ఉండాలి

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

కురిచేడు: రైతులు యూనిక్ ఐడీ నంబర్ కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని బోదనంపాడులో మంగళవారం ఆయన రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించి రైతులకు అవగాహన కలిగించారు. వ్యవసాయ రంగాన్ని ఆధునికీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు యూనిక్ నంబర్ అందిస్తోందన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా వివిధ రాయితీలు పొందాలంటే యూనిక్ నంబర్ తప్పనిసరన్నారు. రైతులు తగు సమాచారంతో రైతు సేవా కేంద్రాలను సందర్శించి గ్రామ వ్యవసాయాధికారులను కలిసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



దొనకొండ: ఇండ్లచెరువులో రైతులతో ఏఓ

దొనకొండ: ప్రభుత్వ పథకాలు పొందాలంటే రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పని సరిగా ఉండాలని మండల వ్యవసాయధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని ఇండ్లచెరువులో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రైతు విశిష్ట గుర్తింపు కార్డుకు రైతులంతా దరఖాస్తు చేసుకుని ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఆధార్ కార్డుకు లింకైన ఫోన్ నంబర్, ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం తీసుకెళ్లి ఆన్‌లైన్ నమోదు చేసుకుని డిజిటల్ గుర్తింపు కార్డు పొందాలన్నారు. ప్రభుత్వం ద్వారా అందించే సంక్షేమ పథకాలు రైతులకు నేరుగా వచ్చేందుకు డిజిటల్ గుర్తింపు కార్డు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. అనంతరం రైతులకు సూచనలు అందించారు. ఆయన వెంట సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: పంటలపై విచక్షణా రహితంగా వాడుతున్న రసాయనిక ఎరువులతో ప్రాణకోటికి ప్రమాదం ఉంటుందని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి పేర్కొన్నారు. మండలంలోని చట్లమిట్ల, బోయిదగుంపుల, తోకపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రసాయనిక ఎరువులు తగ్గించి రైతులు సేంద్రియ ఎరువుల వినియోగం వైపు మొగ్గు చూపాలన్నారు. పురుగుల ఉధృతి పరిమితి దాటినప్పుడు మిత్ర పురుగులకు హాని కలగని క్రిమి సంహారక మందులు మాత్రమే వినియోగించాలన్నారు. యాజమాన్య, జీవ నియంత్రణ, రసాయనిక పద్ధతులను సమతుల్యంతో ఆచరించాలన్నారు. పంటలకు మేలు చేసే మిత్ర పురుగులను రైతులు అవగాహన లేక ఇతర పురుగులతో పాటు వాటిని చంపేస్తున్నారని, చీడ పీడల ఉనికిపై నిఘా ఉండాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

కందికి మద్దతు ధర కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

తాళ్లూరు: కందికి మద్దతు ధర కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు సూచించారు. మల్కాపురం, రాజానగరం, విఠలాపురం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కంది రైతులకు ప్రభుత్వ మద్దతు ధర 2024-25 సంవత్సరానికి రూ.7,550 ఉందని, బహిరంగ మార్కెట్లో ధర దీనికి అదనంగా ఉంటే నిరభ్యంతరంగా అమ్ముకోవచ్చని చెప్పారు. ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా కందిలో ఆశించిన దిగుబడులు రాలేదని, దీంతో డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, మంచి ధరలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వీఏఏ కె.అశోక్, రైతులు పాల్గొన్నారు.



పెద్దారవీడు: రైతులతో మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి



తాళ్లూరు: కందిని పరిశీలిస్తున్న ఏవో ప్రసాద్‌రావు

పశువులకు చికిత్స



పశువుకు ఇంజెక్షన్ వేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కురిచేడు: మండలంలోని దేకనకొండలో మంగళవారం పశువైద్య సిబ్బంది పలు పశువులకు చికిత్స చేశారు. మెదవిరుపు వ్యాధితో దూడల మృతి శీర్షికతో ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనానికి స్పందించిన అధికారులు గ్రామంలోని పశువులకు చికిత్స అందజేశారు. ఇంటింటా సర్వే నిర్వహించి పశువులకు అవసరమైన ఇంజెక్షన్లు వేశారు.

బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



క్షతగాత్రుడు ఆదినారాయణ

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని రమణాలవారిపాలెం మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు.. మండలంలోని రమణాలవారిపాలెం గ్రామానికి చెందిన గోపన బోయిన ఆదినారాయణ వ్యక్తిగత పనులపై ఈదర వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రమణాలవారిపాలెం మూలమలుపులో బైకు అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనానికి సమాచారం అందించటంతో సిబ్బంది దారా కోటయ్య, కందిమళ్ల వెంకటరావులు వచ్చి క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అద్దంకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు సిఫారసు చేశారు.

కార్మికుల పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు జూపల్లి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

దర్శి (కురిచేడు): మున్సిపల్ ఉద్యోగ, కార్మికులకు గత ప్రభుత్వం వేతనాలు పెంచిందని, వాటిని ప్రస్తుత ప్రభుత్వం ఇంతవరకూ విడుదల చేయలేదని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు జూపల్లి కోటేశ్వరరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరుతూ నగర పంచాయతీ మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావుకు కార్మికులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను ఏ ప్రభుత్వం వచ్చినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వాలు మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో మున్సిపల్ కార్మికుల కుటుంబ పోషణ జరగక అర్ధాకలితో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత సమ్మె కాలంలో ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు, ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని కమిటీ వేశారని, ఆ కమిటీ నివేదిక ఆధారంగా జీతాలు చెల్లించాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని కోటేశ్వరరావు కోరారు. మున్సిపల్ కార్మికుల సర్వీస్ క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల నాయకులు ఇత్తడి ఇర్మియా, ఇత్తడి ఇస్సాకు, గర్నెపూడి దావీదు, చాట్ల బాబూరావు, ఇత్తడి ఏసోబు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై గిరిజనులకు అవగాహన

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఐనముక్కల చెంచు కాలనీలో చెంచు గిరిజనులకు బాల్య వివాహాలపై మంగళవారం అవగాహన కల్పించారు. న్యాయవాది వెలుగొండయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టం, న్యాయం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాల్లో ఎవరూ పాల్గొనకూడదన్నారు. నేడు ప్రభుత్వాలు ప్రజలందరికీ అనేక సంక్షేమ పథకాలు అందిస్తోందని, సంక్షేమ పథకాలు ఉపయోగించుకుకొని మెరుగైన జీవనం పొందాలన్నారు. చిన్న వయసులో వివాహాలు చేస్తే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మార్కాపురం లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయవాది యూసఫ్ అలీ, పూర్ణకంటి తిరుమలయ్య, ఏఎన్ఎం నాగలక్ష్మి పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం?

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని ఈదరలో ఓ వ్యక్తి వద్ద గంజాయిని పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అతడు తన అమ్మమ్మ గ్రామమైన ఈదరకు రాకపోకలు సాగిస్తున్నాడు. గతంలో గంజాయి వ్యాపారం చేసి పోలీసులకు చిక్కాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తన వ్యాపారాన్ని తిరిగి ప్రారంభించాడు. తన స్వగ్రామం మార్టూరు మండలం నుంచి ఈదరకు తరుచూ వచ్చి వెళ్తూ వినుకొండ పరిసర ప్రాంతాల్లో తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించాడు. ఇతర జిల్లాల్లోని గంజాయి వ్యాపారులతో సంబంధాలు పెట్టుకుని తన వ్యాపారాన్ని యథేచ్ఛగా నిర్వహిస్తున్నాడు. ఈ సమాచారం పోలీసులకు అందటంతో అతడిని, అతని వద్ద గంజాయిని స్వాధీనం చేసుకుని పూర్తిస్థాయిలో విచారణ చేపట్టినట్లు సమాచారం. పోలీసులను వివరణ కోరగా విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలుపుతామని చెప్పడం గమనార్హం.